సాక్షి
జనగామ
గురువారం । 21 । డిసెంబర్ । 2023



సమస్యలు పరిష్కరిస్తాం

కాకతీయ యూనివర్సిటీ విశ్రాంత నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని కేయూ వీసీ రమేశ్ అన్నారు. - 8లో▸



క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించాలి

పోటీల్లో పాల్గొనే విద్యార్థులు క్రీడా నైపుణ్యం ప్రదర్శించాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27^{0} / 16^{0}

ఆకాశం అధికశాతం మేఘావృతమై ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి. రాత్రి పూట చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రేపు జాబ్ మేళా

జనగామ రూరల్: ప్రైవేట్ కంపెనీలో ఇంటర్, డిగ్రీ, పీజీ అర్హతతో 335 వరకు ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని, ఇందుకు ఈనెల 22న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ధ్రువపత్రాలతో ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని ఉపాధి కార్యాలయంలో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 79954 30401 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వ్యవసాయ విద్యుత్ బిల్లులు చెల్లించండి

జనగామ: జిల్లాలో వ్యవసాయ బోరు బావి కనెక్షన్లకు సంబంధించిన విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఎన్పీడీసీఎల్ డివిజనల్ ఇంజనీర్ లక్ష్మీనారాయణరెడ్డి బుధవారం రైతులను ఒక ప్రకటనలో కోరారు. ఏడాది బిల్లు రూ.360 తోపాటు పాత బకాయిలు సైతం పూర్తిగా చెల్లించి సంస్థకు సహకరించాలన్నారు.

రాష్ట్రస్థాయి సెమినార్‌కు అశోక్ ఎంపిక



కొడకండ్ల : ఎస్‌ఈఆర్‌టీ హైదరాబాద్‌లో ఈ నెల 22న నిర్వహించే రాష్ట్ర స్థాయి గణిత సెమినార్‌కు కొడకండ్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పోగు అశోక్ ఎంపికయ్యాడు. గణిత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ హైదరాబాద్.. ఉపాధ్యాయుల నుంచి పరిశోధన పత్రాలు ఆహ్వానించగా పోగు అశోక్ ఎంపికయ్యాడు. సెమినార్‌లో అశోక్ తన పరిశోధన పత్రాన్ని ప్రజెంట్ చేయనున్నాడు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జఫర్‌గఢ్: తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు ధరంసోతు రాజేందర్, జాటోతు అంజి, 9వ తరగతి విద్యార్థిని తౌటి నిఖిత రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఇటీవల హనుమకొండలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వీరు ఈనెల 21 నుంచి నిర్మల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులను జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, సర్పంచ్ మంద మల్లేష్, దాత చాడ ప్రవీణ్ కుమార్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో పీఈటీ కొండ రవి, ఉపాధ్యాయులు మంగు జయప్రకాశ్ పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల ఆర్గనైజింగ్ కమిటీ ఎన్నిక



జనగామ రూరల్: క్రిస్మస్ పండుగ సందర్భంగా పేద క్రిస్టియన్లకు ప్రభుత్వం అందించే కానుకల పంపిణీకి వేడుకల ఆర్గనైజేషన్ కమిటీని బుధవారం ఆర్డీఓ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పిలిప్స్, ఉపాధ్యక్షుడు ఎం.దేవసహాయం, జనరల్ సెక్రెటరీ దేవదానం, ఆర్గనైజింగ్ సెక్రెటరీ లక్ష్మణ్, మీడియా కన్వీనర్ రాజ్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ ఎం.జాన్‌కుమార్, కోశాధికారి ప్రభాకర్, కార్యవర్గసభ్యులు పిట్టల్ పాస్టర్, పరంజ్యోతి, సల్మాన్, ప్రోగ్రాం ఆర్గనైజర్ పసుల ఏబెల్, చైర్మన్‌గా నల్లా జాన్ ఎన్నికయ్యారు.

'సోషల్ వెల్ఫేర్'లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరం 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆర్‌సీఓ రజని, స్థానిక గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ కాళహస్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని, గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు రూ.100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకు 2024 జనవరి 6 చివరి తేదీ, 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు సమీపాన ఉన్న గురుకుల పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

గురుకుల కళాశాలల్లో..

2024–25 విద్యాసంవత్సరానికి సోషల్ వెల్ఫేర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్ సీట్ల భర్తీకి నిర్వహించే ప్రవేశ పరీక్షకు 2024 జనవరి 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

చుక్కల్లో 'సన్నాలు'

- ఆకాశాన్నంటిన బియ్యం ధరలు
- సన్నరకం క్వింటాకు రూ.1,300 పెంపు
- జిల్లాలో తగ్గిన పంట సాగు
- ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి
- సామాన్య, పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం



జనగామ: సన్నరకం బియ్యం ధరలు ఆకాశాన్నంటాయి. దీంతో సామాన్య, పేద, మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోంది. జిల్లాలో సన్నరకం ధాన్యం సాగు అంతకంతకు తగ్గిపోవడంతో.. ఇతర జిల్లాలు, పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి నెలకొంది. ఆరు నెలల క్రితం ధరలతో పోల్చితే క్వింటాకు రూ.1,000 నుంచి రూ.1,300 పెరిగాయి. దీంతో ఒక్కో కుటుంబంపై ఏడాదికి సుమారు రూ.5వేల వరకు అదనపు భారం తప్పడం లేదు. జిల్లాలో వానాకాలం సీజన్‌లో 3.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు నమోదు కాగా, 1.80లక్షల ఎకరాల్లో వరి వేశారు. ఇందులో 95 శాతం దొడ్డు రకమే ఉంది. 5 శాతం మాత్రమే సన్నాలు పండించారు. దొడ్డు రకం ధాన్యం ధర కేంద్ర ప్రభుత్వం పెంచడంతో మెజార్టీ రైతులు దీనిపైనే దృష్టి సారిస్తున్నారు. కాగా సన్నాలతో పోలిస్తే దొడ్డు రకం వరి నెల రోజుల ముందుగానే కోతకు వస్తుంది.. అలాగే దిగుబడి కూడా అధికంగా వస్తుండడంతో అన్నదాతలు అటు వైపే ఆసక్తి చూపుతున్నారు. సన్నరకంపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించినా రైతులు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఏడాదిన్నర క్రితం నాటి ప్రభుత్వ ఆదేశాల మేరకు వేల ఎకరాల్లో సన్నరకం ధాన్యం సాగు చేయగా అధిక ఉత్పత్తులతో ధర ఒక్కసారిగా పడిపోయింది. ఆరుగాలం చేసిన శ్రమకు తగిన ఫలితం దక్కకపోవడంతో రైతులు దొడ్డు రకాలనే నమ్ముకుంటున్నారు.

సన్నరకం ధరల భారం..

జిల్లాలో ప్రతి నెలా సుమారు 50వేల క్వింటాళ్లకు పైగా సన్న బియ్యం అమ్మకాలు జరుగుతున్నాయి. తెలంగాణలోని తిర్మలగిరి, మిర్యాలగూడ, కోదాడ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసి, జార్ఖండ్ తదితర ప్రాంతాల నుంచి ఏజెంట్ల సహకారంతో జిల్లాకు సన్నరకం బియ్యం దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లాలో 150 వరకు ప్రత్యేకంగా బియ్యం దుకాణాలు ఉండగా.. కిరాణా, ఇతర సూపర్ మార్కెట్లు కలుపుకుని 500లకు పైగానే ఉంటాయి. ఆరు నెలల క్రితం కొత్తరకం బీపీటీ క్వింటా ధర రూ.4వేలు ఉంటే ప్రస్తుతం రూ.4,500లకు పెరిగింది. పాత రకం రూ.4,600 ఉండగా రూ.5,400లకు చేరింది. ఇలా ఆర్‌ఎన్‌ఆర్, జైశ్రీరాం, హెచ్‌ఎంటీ రకం బియ్యం ధరలు రోజురోజుకూ చుక్కలనంటుతున్నాయి. ఇదిలా ఉండగా క్వింటాకు రూ.1,600 ఉన్న నూకల ధర నేడు రూ.3,000 చేరింది. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు సన్నరకం ధాన్యం సాగు పెరిగేలా రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

బీపీటీ రకం(క్వింటా ధర)		
రకం	ప్రస్తుత	ఆరు నెలల క్రితం
కొత్తవి	రూ.4,600	రూ.4,000
పాతవి	రూ.5,400	రూ.4,600
ఆర్‌ఎన్‌ఆర్(సన్నరకం)		
కొత్తవి	రూ.5,000	రూ.4,600
పాతవి	రూ.6,000	రూ.5,200
హెచ్‌ఎంటీ(సన్నరకం)		
కొత్తవి	రూ.6,200	రూ.5,400
పాతవి	రూ.6,200	రూ.5,400
జైశ్రీరాం(సన్నరకం)		
కొత్తవి	రూ.6,000	రూ.4,800
పాతవి	రూ.6,800	రూ.5,500
నూకలు		
	ప్రస్తుతం	ఆరు నెల క్రితం
	రూ.3,000	రూ.1,600

వానాకాలం దొడ్డు రకం పండిస్తాం..



వానాకాలంలో సన్నరకం వరి సాగు చేస్తే రోగాల బారినపడి దిగుబడి తగ్గుతుంది. అందుకే దొడ్డు రకం మాత్రమే సాగు చేస్తున్నాను. నాకు రెండెకరాల పొలం ఉంది. దొడ్డు రకం సాగు చేయగా 70 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సన్నరకం వేస్తే 25 క్వింటాళ్లు కూడా రాని పరిస్థితి ఉంటుంది. ప్రైవేట్‌లో దొడ్డురకం క్వింటాకు రూ.2,200 లెక్కన అమ్ముకున్నం. నలుగురు కుటుంబ సభ్యులకు 4 నెలలకు సరిపడా కొత్త సన్న బియ్యం రూ.5వేలకు క్వింటా చొప్పున కొనుగోలు చేసినం. గతం కంటే రూ.1,300 పెరిగింది.

- సుంకరి కుమార్, కనీలకుంట, తరిగొప్పల

అదనపు భారం



ఫర్టిలైజర్ దుకాణంలో ఉద్యోగం చేస్తున్నా. నెలకు రూ.14వేల వేతనం. కుటుంబంలో ఐదుగురు సభ్యులం. ఏడాదికి నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల సన్న బియ్యం కొనుగోలు చేస్తున్నం. ఇప్పుడు ధర రూ.5వేలు దాటి పోవడంతో అదనపు భారం తప్పడం లేదు. వీటితో పాటు నిత్యావసర సరుకుల ధరలు కూడా బాగా పెరిగాయి. ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తున్నది.

- ఎల్లయ్య, ప్రైవేటు ఉద్యోగి, జఫర్‌గఢ్

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

- జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ సుగుణాకర్‌రాజు

జఫర్‌గఢ్: వైద్యులు, వైద్య సిబ్బంది విధుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ సుగుణాకర్ రాజు హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పరిసరాలను, డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించిన అనంతరం వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది 24 అందుబాటులో ఉండి ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించాలని, సీజనల్ తదితర వ్యాధుల విషయమై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రమౌళి, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సుగుణాకర్‌రాజు

రేపు 'సదరం' స్లాట్ బుకింగ్ చేసుకోవాలి

జనగామ రూరల్: గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా ప్రధాన ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించే సదరం క్యాంపునకు దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకోవాలని డీఆర్‌డీఓ మొగిలప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు స్లాట్ ప్రారంభమవుతుందని, 23న ఆర్థోపెడిక్(కొత్తవి 30, రెన్యూవల్ 30) 60, 28న మానసిక దివ్యాంగులు(కొత్తవి 15, రెన్యూవల్ 15) 30, 29న వినికిడి లోపం ఉన్న(కొత్తవి 30, రెన్యూవల్ 20) 50 మందికి పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మీసేవా కేంద్రంలో ఆధార్ కార్డులతో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు.

బదిలీల కలకలం..!

- వరంగల్ కమిషనరేట్‌లో పలువురికి స్థానచలనం?
- పోలీస్ అధికారుల్లో కొనసాగుతున్న చర్చ..
- మంత్రులు, ఎమ్మెల్యేలను కలుస్తున్న ఆశావహులు
- కాంగ్రెస్ ప్రభుత్వ పాలసీపై సందిగ్ధం.. హామీ ఇచ్చేందుకు వెనుకాడుతున్న నేతలు
- లూప్‌లైన్ అధికారులకు ప్రాధాన్యం?.. బీఆర్‌ఎస్ బ్రాండ్ అధికారులపై వేటు

సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీస్ వర్గాల్లో బదిలీల అంశం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రభుత్వం చేపట్టిన ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీల సెగ పది రోజుల్లో జిల్లాలను తాకవచ్చన్న ప్రచారం బలంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని కొందరు డీసీపీలతోపాటు వరంగల్, హనుమకొండ, కాజీపేట పరిధిలోని పలువురు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లకు స్థాన చలనం తప్పదన్న చర్చ ఆ వర్గాల్లో జరుగుతోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో సుమారు పదేళ్ల పాటు కమిషనరేట్ పరిధిలో కీలక ఠాణాలు, సబ్‌డివిజన్‌లలో పనిచేసిన అధికారులకు బదిలీలు తప్పవంటున్నారు. ఇటీవల ఎన్నికల్లో ఫలితాలు తారుమారవడంతో రూటు మార్చిన కొందరు 'కౌంటింగ్ సెంటర్'ల నుంచే లాబీయింగ్ మొదలెట్టారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసినప్పటికీ స్పష్టమైన హామీ దొరకలేదన్న ప్రచారం ఉంది. బదిలీలపై ప్రభుత్వ పాలసీ తేలడం లేదని దాటవేస్తున్నట్లు సమాచారం. ఇంతకాలం లూప్‌లైన్‌లో ఉండి కాంగ్రెస్ నేతలకు ఇబ్బంది కలిగించని అధికారులను ఇప్పుడు తెరపైకి తెచ్చే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఏదేమైనా త్వరలోనే పోలీసు అధికారుల బదిలీల ప్రక్రియలో భాగంగా కమిషనరేట్‌లో పలువురికి స్థాన చలనం కలగనుంది.

బదిలీ ఎవరెవరికో..?

అసెంబ్లీతో మొదలైన ఎన్నికల ప్రక్రియ సర్పంచ్‌లు మొదలు పార్లమెంట్, జిల్లా, మండలపరిషత్‌ల వరకు సాగనుంది. వచ్చే నెలాఖరుకు క్షేత్రస్థాయిలో పాలనకు కీలకమైన సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుండటంతో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ మేరకు గ్రామ పంచాయతీల వారీగా అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. మార్చి, ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికలు తప్పవంటున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్‌శాఖలోని వివిధ స్థాయిల అధికారుల మార్పు ఉండవచ్చని చెబుతున్నారు. కొన్ని నెలల్లో పదవీ విరమణ చేసే అవకాశం ఉన్నవారు మినహా చాలామందికి స్థాన చలనం ఉంటుందంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో బాధ్యతలు చేపట్టిన పోలీస్ ఉన్నతాధికారుల విషయంలో కమిషనరేట్ పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేల నిర్ణయంపై ఆధారపడి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం గత ప్రభుత్వంలో బాధ్యతలు చేపట్టిన వారిని పూర్తిగా మార్చి తమకు అనుకూలమైన వారిని తీసుకొచ్చే అవకాశం ఉందని సీనియర్ కీలక ప్రజాప్రతినిధి ఒకరు అభిప్రాయపడ్డారు.

బాస్ మార్పు ఉంటుందా...?

ఎన్నికల సంఘం ఆదేశానుసారం షెడ్యూల్ విడుదల అనంతరం పలు కమిషనరేట్‌లు, జిల్లాలకు నాన్ కేడర్ అధికారుల స్థానంలో ఐపీఎస్ అధికారులను పోలీస్ బాస్‌లుగా నియమించారు. ఈ క్రమంలో వరంగల్ సీపీగా ఉన్న ఏవీ రంగనాథ్ అక్టోబర్ 11న బదిలీ కాగా ఆయన స్థానంలో అంబర్ కిషోర్ ఝాను నియమించారు. గతంలో జిల్లాలో పనిచేసిన అనుభవం ఉన్న సీపీ అంబర్ కిషోర్‌కు నిక్కచ్చిగా వ్యవహరించే అధికారిగా పేరుంది. కమిషనరేట్ పరిధిలో నిబంధనలకు అనుగుణంగానే ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించారనే పేరుంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు అనే తేడా లేకుండా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుతీరును పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో వారే కొనసాగుతారా..? కొత్తవారు వస్తారా అనేది కొంతకాలం ఆగితేనే తెలుస్తుంది.



బదిలీల ప్రచారంలో డీసీపీలు, ఏసీపీలు...

వరంగల్ కమిషనరేట్‌లో కీలకమైన సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ జోన్‌లకు ఎంఏ బారి, పి.రవీందర్, పి.సీతారాం డీసీపీలుగా వ్యవహరిస్తున్నారు. ఈ ముగ్గురు బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో పోటాపోటీ ప్రయత్నాల మధ్య ఈ పోస్టింగ్‌లు సాధించారన్న ప్రచారం ఉంది. ఈ మూడు జోన్ల పరిధిలోని 9 సబ్ డివిజన్లలో ఉన్న అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్(ఏసీపీ)లు పలువురు గత ప్రభుత్వం హయాంలో బీఆర్‌ఎస్ నేతలతో అంటకాగారన్న ఆరోపణలు ఉన్నాయి. సెంట్రల్ జోన్, వెస్ట్‌జోన్‌ల పరిధిలోని ఇద్దరు ఏసీపీలు ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలను ఇబ్బంది పెట్టారన్న ఫిర్యాదులున్నాయి. ఈస్ట్‌జోన్‌లోని ఓ ఏసీపీపైనా ఇవే ఆరోపణలు ఉన్నాయి. కమిషనరేట్ పరిధిలోని ఇద్దరు ఏసీపీలకు ఎన్నికలకు ముందు బదిలీ అయినా.. బీఆర్‌ఎస్ పెద్దల ప్రమేయంతో తిరిగి ఆ బదిలీలను రద్దు చేసుకుని అవే స్థానాల్లో కొనసాగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థులకు దగ్గరగా ఉండేవారిని బెదిరింపులకు గురి చేశారన్న ఫిర్యాదులున్నాయి. అదే విధంగా వరంగల్, హనుమకొండ, కాజీపేట, నర్సంపేట, పరకాల, మామునూరు, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట సబ్ డివిజన్ల పరిధిలో పనిచేసిన కొందరు ఇన్‌స్పెక్టర్లు అప్పటి అధికార పార్టీ నేతలకు అనుకూలంగా వ్యవహరించి వ్యతిరేక పార్టీకి చెందిన వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో వారు సైతం మంచి పోస్టింగ్‌ల్లో కొనసాగేందుకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతుండటం పోలీస్‌శాఖలో చర్చనీయాంశం అవుతోంది.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ శివలింగయ్య, పక్కన అదనపు కలెక్టర్లు, ఇతర జిల్లా అధికారులు

- వీసీలో రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

జనగామ: రానున్న పార్లమెంట్ ఎన్నికలకు ఓటరు జాబితా తయారీతో పాటు ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. త్వరలో రానున్న పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటరు జాబితాను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడంతో పాటు తప్పులు లేకుండా చూడాలని చెప్పారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల కోసం వచ్చే దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని సూచించారు. వీసీలో కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పర్మార్ పింకేశ్‌కుమార్, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓలు మురళీకృష్ణ, రామ్మూర్తి, కలెక్టరేట్ ఏఓ పి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- అదనపు కలెక్టర్ పర్మార్ పింకేష్‌కుమార్

జనగామ: పురపాలిక పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జాప్యం చేయకుండా వేగం పెంచడంతో పాటు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర పర్మార్ పింకేష్‌కుమార్(స్థానిక సంస్థలు) ఆదేశించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ చంద్రమౌళితో కలిసి పట్టణ పరిధిలోని బృహత్ ప్రకృతి వనంతో పాటు డంపింగ్ యార్డ్‌లో చేపట్టిన బయోమైనింగ్, రాంనగర్‌లో మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం, ఫిల్టర్ బెడ్‌లోని నీటి శుద్ధి కేంద్రం, మోడల్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ యార్డు, శ్మశాన వాటిక పనులను ఆయన బుధవారం తనిఖీ చేశారు. అనంతరం నెల్లుట్ల శివారులోని మురికి నీటి శుద్ధి కేంద్రం నిర్మించే ప్రదేశాన్ని పరిశీలించారు. మున్సిపాలిటీలో జరుగుతున్న పనుల పురోగతి తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీల విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించొద్దని చెప్పారు. ప్రస్తుతం చేపట్టిన అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెంచి నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఏఈ మహిపాల్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధు, తదితరులు ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

బీఎల్‌ఓలు బాధ్యతగా పనిచేయాలి

- ఆర్‌డీఓ వాసం రామ్మూర్తి

స్టేషన్‌ఘన్‌పూర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా నూతన ఓటర్ల నమోదు, ఓటరు జాబితా సవరణ, మార్పులు, చేర్పులు, మృతిచెందిన వారి పేర్ల తొలగింపు తదితర అంశాలపై బీఎల్‌ఓలు బాధ్యతగా పనిచేయాలని ఆర్‌డీఓ వాసం రామ్మూర్తి అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీఎస్‌ఎస్‌లో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్ అధికారులకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన ఎన్నికల విధులు, నిబంధనలపై వివరించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా రానున్న పార్లమెంట్ ఎన్నిలను విజయవంతంగా నిర్వహించేలా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ విజయ్‌కుమార్, ఎంఆర్‌ఐ రవీందర్, శిక్షణ నిపుణులు పి.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డీఓ రామ్మూర్తి

యాప్‌లో 'ఉపాధి' వివరాలు

- డీఆర్‌డీఏ ఏపీడీ బాలకృష్ణ

దేవరుప్పుల : ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీల వేతనాల మంజూరు, చెల్లింపులు, పెండింగ్ వంటి సమగ్ర వివరాలు తెలవడానికి ప్రత్యేకంగా యాప్ రూపొందించినట్లు డీఆర్‌డీఓ ఏపీడీ బాలకృష్ణ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వడ్డేపల్లి ఉమామహేశ్వర్ అధ్యక్షతన ఉపాధి హామీ–కూలీ పనుల పెంపుకై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలు తమ కుటుంబ సభ్యుల చేతిలో ఉండే స్మార్ట్‌ఫోన్‌లో సదరు యాప్ డౌన్‌లోడ్ చేసుకుని జాబ్‌కార్డు నంబర్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఇక నుంచి కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరిగే సమస్య ఉండదన్నారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు మాస్టర్ పాండ్ బెడ్స్, బ్యాగుల్లో నింపేందుకు మట్టి సేకరణ, ప్రతి గ్రామంలో 50 మంది కూలీలకు పని కల్పనకు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీఓ శ్రీనివాస్, ఎంపీఓ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న బాలకృష్ణ

క్లుప్తంగా

ఆర్ఎంకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాజీపేట అర్బన్ : ఆర్టీసీ అద్దె బస్సు యజమానుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వరంగల్ రీజియన్ అధ్యక్షుడు మారిపెల్లి రామిరెడ్డి అన్నారు.ఈ మేరకు సంఘం నాయకులు బుధవారం ఆర్ఎం శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో అద్దె బస్సుల్లో సరాసరి 120 మంది కెపాసిటీతో మాత్రమే నడుస్తున్నాయన్నారు. డ్రైవర్లు డ్యూటీ చేయడానికి ఆసక్తి చూపడం లేదని, ప్రయాణికులు గొడవలకు దిగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం కేసులో డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

దంతాలపల్లి : ద్విచక్ర వాహనాన్ని యాక్సిడెంట్ చేసి ఇద్దరి మృతికి కారణమైన బస్సు డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష ఖరారైనట్లు ఎస్సై రమేష్‌బాబు బుధవారం తెలిపాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిర్యాల గ్రామానికి చెందిన కొమ్ము సతీష్(25), కొమ్ము సురేష్(23) మండలంలోని పెద్దముప్పారంలో పెండ్లి పత్రికలు పంపిణీ చేసి వస్తున్నారు. తొర్రూరు టౌన్ దుబ్బతండాకు చెందిన బస్సు డ్రైవర్ పుర్మ వెంకన్న విధి నిర్వహణలో భాగంగా 2016 సంవత్సరంలో సూర్యాపేట నుంచి దంతాలపల్లికి వస్తున్నాడు. ముప్పారం క్రాస్ రోడ్డు వద్ద బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. మృతుల తండ్రి కొమ్ము మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వాదప్రతివాదనల అనంతరం జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సరిత రెండేళ్ల శిక్ష ఖరారు చేస్తు తీర్పు ఇచ్చారని ఎస్సై తెలిపారు. కేసు నడిపి శిక్ష పడేల చేసిన పీపీ ఆనంద్‌గణేష్, ఐఓ రమేష్‌బాబు, కోర్టు కానిస్టేబుల్ రాజారాంను అధికారులు అభినందించారు.

75శాతం బ్యాక్‌లాగ్ ఉన్నా పై సెమిస్టర్‌కు అర్హతే

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ (నాన్ ప్రొఫెషనల్) విద్యార్థులు గరిష్టంగా 75శాతం బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు ఉన్నప్పటికీ వారు తర్వాత సెమిస్టర్‌కు అర్హత సాధిస్తారని (రెండో సెమిస్టర్ నుంచి మూడో సెమిస్టర్‌కు, నాల్గోవ సెమిస్టర్ నుంచి ఐదో సెమిస్టర్‌కు వెళ్లేందుకు గాను) పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి తెలిపారు. విద్యార్థులు నియమిత అటెండెన్స్ కలిగి ఉండాలన్నారు. సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ నామినల్ రోల్‌తో పాటు విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్ పరీక్షల విభాగానికి సంబంధిత సెక్షన్‌లో అందజేయాలన్నారు. దీనికి సంబంధించి అర్హులైన విద్యార్థుల జాబితా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కేయూ ఆన్‌లైన్.కో.ఇన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు.

క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించాలి

● ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం : క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు నైపుణ్యం ప్రదర్శించాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ అంకిత్ తెలిపారు. బుధవారం ములుగు జిల్లా ఏటూరునాగారంలోని కొమురం భీం స్టేడియంలో అండర్–14, 17 విభాగాల్లో క్రీడలు ప్రారంభమయ్యాయి. ఐటీడీఏ పరిధిలోని కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల నుంచి 1,900 మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పీఓ అంకిత్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు.ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థినులు నృత్యాలతో క్రీడలకు స్వాగతం పలికారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసేందుకు ఈ జోనల్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులను భద్రాచలంలోని కిన్నెరసానిలో జరిగే స్టేట్ లెవల్ ట్రైబల్ మీట్‌కు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు పోచం, ఎర్రయ్య, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఏటీడీఓ దేశీరాం, ఏసీఎంలు రవీందర్, శ్రీరాములు, డిప్యూటీ ఈఓ సారయ్య, ఏఏసీఎంఓ వాగ్య, స్పోర్ట్స్ ఆఫీసర్లు కిష్టు, ఆదినారాయణ, మోహన్, గోపాల్‌రావు, జీసీడీఓలు సుగుణ, విజయ, పీజీ హెచ్ఎంలు శ్రీనివాస్, సారంగపాణి, పీడీలు, పీఈటీలు, ఎస్‌జీటీలు, ఎస్‌సీఆర్పీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అంకిత్



కబడ్డీ ఆడుతున్న ములుగు, మహబూబాబాద్ జట్లు



వాలీబాల్ ఆడుతున్న కొత్తగూడ, ఏటూరునాగారం జట్లు

చేపల ఉత్పత్తి కేంద్రం స్థలం కబ్జా



1973లో వేసిన శిలాఫలకం



చదును చేస్తున్న చేపల ఉత్పత్తి కేంద్ర స్థలం

● ఇప్పటికే అంగడి స్థలం అమ్మకం
● స్పందించని కలెక్టర్, కమిషనర్

హసన్‌పర్తి : మండలంలోని ఎల్లాపురం గ్రామంలో కోట్లాది రూపాయల విలువ గల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది. స్థానిక మాజీ ప్రజాప్రతినిధి సోదరుడు కబ్జా చేసి దర్జాగా చదును చేశాడు. నిరుపయోగంగా ఉన్న చేపల ఉత్పత్తి కేంద్రంతో పాటు మూడెకరాల అంగడి స్థలాన్ని సైతం కబ్జా చేసి విక్రయించారు. వివరాలు.. ఎల్లాపురంలో సర్వే నంబర్ 246/1లో సుమారు 12 ఎకరాల ప్రైవేట్ స్థలం ఉంది. అయితే ఇందులో సుమారు రెండున్నర ఎకరాల భూమిని హసన్‌పర్తికి చెందిన దాత చేపల ఉత్పత్తి కేంద్రానికి దానం ఇచ్చాడు. అందులో భవనంతో పాటు బావి నిర్మించారు. కాలక్రమేణ ఉత్పత్తి కేంద్రం ఆదరణ కరువై, ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. ముప్పై ఏళ్లుగా ఇక్కడ ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించలేదు.

విలువైన భూమిపై కన్ను..

ప్రస్తుతం చేపల ఉత్పత్తి కేంద్రం నిరుపయోగంగా ఉండడంతో స్థానిక మాజీ ప్రజాప్రతినిధి సోదరుడి కన్ను పడింది. ఈభూమిని చదును చేస్తుండగా స్థానికులు ప్రశ్నించారు. ఎవరికి చెబుకుంటారో చెప్పుకోండని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు వారు తెలిపారు.

ఫిర్యాదులు బుట్టదాఖలు..

ఎల్లాపురం గ్రామంలో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని కలెక్టర్, కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేశారు. అయితే ఫిర్యాదులు బుట్టదాఖలైనట్లు స్థానికులు చెబుతున్నారు.

సీఎంకు ఫిర్యాదు చేస్తాం..

ప్రభుత్వ స్థలాల కబ్జాపై ఉన్నతాధికారులు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదని భూ పరిరక్షణ కమిటీ సభ్యుడు రేనుకుంట్ల దుర్గా ప్రసాద్ తెలిపారు. పూర్తి ఆధారాలతో ముఖ్యమంత్రికి అందజేస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న రాజన్న, విద్యార్థులు

● కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజన్న

మామునూరు : ప్రకృతి వ్యవసాయాన్ని సాగు చేసేలా ప్రతీ రైతును ప్రోత్సహించాలని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న సూచించారు. ఈమేరకు బుధవారం శాస్త్రవేత్తలు మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పంచగవ్వ సేంద్రియ ఉత్పత్తి అని, ఇది మొక్కల పెరుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. ఎకరం పంచగవ్వ తయారీకి 7 కిలోల ఆవు పేడ, కేజీ నెయ్యి కలిపి మూడు రోజుల తర్వాత ఆవు మూత్రం 10లీటర్లు, ఆవుపాలు 3లీటర్లు, పెరుగు 2లీటర్లు కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పుష్పించే, కాయ వేసే దశలో పిచికారీ చేయాలని సూచించారు. పంచగవ్వను ప్రధానంగా వరి, ప్రొద్దు తిరుగుడు, టమాట, ఉల్లిపాయ పంటలలో ఎక్కువగా ఉపయోగించవచ్చునని తెలిపారు. అనంతరం మల్లారెడ్డి విశ్వవిద్యాలయం విద్యార్థులు పంచగవ్వ తయారీ, వాడే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో శాస్త్రవేత్త రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ కిడ్నాప్‌నకు యత్నం

● పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

ఎస్ఎస్ తాడ్వాయి : మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తాడ్వాయి ఎస్సై ఓంకార్ యాదవ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన సురకంటి సరస్వతి పెద్దపల్లి జిల్లాకు చెందిన వ్యక్తితో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. ప్రమాదవశాత్తు ఆమె భర్త మృతి చెందడంతో అప్పటి నుంచి ఆమె నార్లాపూర్ తల్లిదండ్రుల వద్దనే ఉంటూ కూలీ పనులు చేసుకుంటుంది. రెండేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన పైడిపల్లి అశోక్ ఆమెను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని వెంటపడేవాడు. అనంతరం అశోక్ వేరే అమ్మాయిని ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. కాగా బుధవారం సరస్వతి పశువులను మందలో కలిపేందుకు గ్రామంలోని వడ్డెర కాలనీ వైపు వెళ్లి ఇంటికి వస్తుంది.ఈ క్రమంలో మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న చికెన్ సెంటర్ వద్దకు వచ్చే సరికి ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కారులో అశోక్ వచ్చి ఆమెను బలవంతంగా కారులోకి ఎక్కించి అసభ్యంగా ప్రవర్తించాడు. చంపుతానని బెదిరించడంతో మహిళ అరుపులు విన్న గ్రామస్తులు ఆమె బంధువులకు సమాచారమివ్వగా పస్రా పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేశారు. పోలీసులు పట్టుకుంటారనే భయంతో అశోక్ సదరు మహిళను కారులో వదిలేశాడు. పోలీసులు వస్తున్నారనే భయంతో పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఓంకార్‌యాదవ్ తెలిపారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తాం

● కేయూ వీసీ తాటికొండ రమేష్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని విశ్రాంత నాన్‌టీచింగ్ ఉద్యోగుల సేవలు మరువలేనివని వారి పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తామని కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. పెన్షనర్ డే సందర్భంగా బుధవారం కేయూలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కేయూకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధనలో విశ్రాంత ఉద్యోగుల సహకారం మరువలేనిదన్నారు. సమావేశంలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా కేయూ శాఖ మేనేజర్ పద్మావతి మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగుల అర్హతను బట్టి బ్యాంకింగ్ సేవల్లో ముందు ఉంటామన్నారు. 70 సంవత్సరాల పైబడి వయస్సు దాటిన విశ్రాంత ఉద్యోగులను శాలువా కప్పి సన్మానించి జ్ఞాపికతో సత్కరించారు.ఈసమావేశంలో విశ్రాంత నాన్‌టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వర్‌రావు, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎస్. సంజీవరావు, లక్ష్మారెడ్డి, నర్సింహారెడ్డి, సంగాల గిడియన్, ఎస్ఎస్ఆర్‌మూర్తి, గుండా చంద్రమౌళి, దేవులపల్లి సారయ్య, మహ్మద్ అక్బర్, అమీన్ తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత ఉద్యోగులతో వీసీ రమేష్ తదితరులు

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన వీసీ

రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ (ఐఏఎస్)బుర్రా వెంకటేశంను కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 19న సాయంత్రం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్‌లో వెంకటేశంను కలిసి యూనివర్సిటీకి సంబంధించిన పలు అంశాలను వివరించారు.

ఆలయ సమీప నిర్మాణాలపై నోటీసులు

● మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పేరిట జారీ

భూపాలపల్లి అర్బన్: మంజూర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామి టెంపుల్ ఆవరణలో చేపడుతున్న గృహ నిర్మాణాలకు సంబంధించి రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు బుధవారం నోటీసులు జారీచేశారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పేరుతో నోటీసులు జారీ చేసి నిర్మాణాలకు అతికించారు. సర్వే నంబర్ 209లో చేపడుతున్న చెరువు శిఖం భూమిలో నిర్మాణాలు అక్రమంగా చేపడుతున్నారని, నిర్మాణ పనులు నిలిపివేయాలని గతేడాది పట్టణానికి చెందిన నాగవెల్లి సరళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు ఏడాది తర్వాత స్పందించారు. ఆలయ ఆవరణలో చేపడుతున్న భవనం నిర్మాణాలు నిలిపేయాలని ఆదేశించారు. రెండు రోజుల క్రితం ఏర్పాటు చేసిన హెచ్చరిక ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారని రెవెన్యూ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిర్మాణాలు చేపట్టవద్దని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.



రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

రేవంత్‌రెడ్డి కేసు ఫిబ్రవరి 8కి వాయిదా

భూపాలపల్లి అర్బన్: సీఎం రేవంత్‌రెడ్డిపై మూడు నెలల క్రితం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వేసిన పరువునష్టం దావా కేసును విచారించిన భూపాలపల్లి జిల్లా కోర్టు వచ్చే ఏడాది ఫిబ్రవరి 8కి వాయిదా వేసింది. తన పరువు, పేరు ప్రతిష్టలకు నష్టం జరిగేలా, వ్యక్తిగత విషయాలపై తప్పుడు ఆరోపణలు చేశారని గండ్ర వెంకటరమణారెడ్డి జిల్లాకోర్టులో పరువు నష్టం దావా వేశారు. బుధవారం జిల్లా కోర్టులో విచారణకు రాగా, రేవంత్‌రెడ్డి తరఫున న్యాయవాది చల్లూరి మధు హాజరయ్యారు. కాగా, కేసును వచ్చే ఫిబ్రవరి 8వ తేదీకి జడ్జి వాయిదా వేసినట్లు న్యాయవాది తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి బలవన్మరణం

వేర్వేరు చోట్ల ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. ధర్మసాగర్ మండలానికి చెందిన విద్యార్థి మిర్యాలగూడలో, కాశీబుగ్గకు చెందిన వ్యక్తి రైలు కింద పడి , మడికొండకు చెందిన వ్యక్తి ఉరి వేసుకొని బుధవారం మృతిచెందారు.



శ్రీనాథ్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: కుటుంబ సభ్యులు మందలించారని ఓ విద్యార్థి రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంముప్పారం గ్రామానికి చెందిన గుంటుపల్లి శ్రీనాథ్(15) మిర్యాలగూడ పట్టణంలోని ఎస్టీ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. శ్రీనాథ్ రెండు రోజులుగా పాఠశాలకు వెళ్లకుండా పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో వడ్డించేందుకు క్యాటరింగ్ బృందంతో కలిసి వెళ్లాడు. శ్రీనాథ్ పాఠశాలకు హాజరుకావడం లేదని హాస్టల్ సిబ్బంది అతడి తల్లికి సమాచారం అందించారు. శ్రీనాథ్‌ను కుటుంబ సభ్యులు ఫోన్‌లో మందలించారు. దీంతో మనస్తాపం చెందిన శ్రీనాథ్ మంగళవారం రాత్రి 10:30 గంటల సమయంలో హాస్టల్ నుంచి బయటకు వచ్చి మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం రైల్వే సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ హుస్సేన్ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



రమేష్ (ఫైల్)

కాశిబుగ్గ : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ధర్మారం గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఊకల్ హవేలీకి చెందిన మొగసాని రమేష్(34) కూలీ పనిచేస్తుంటాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కాగా రమేష్ ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి బైక్‌పై బయటకు వెళ్లి ధర్మారం గ్రామ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తల పగిలి డౌన్‌లైన్ ట్రాక్ పక్కన్న పడి అక్కడిక్కడే మృతి చెందాడు. బుధవారం డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.రాజు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి మృతుని భార్య స్వాతికి అప్పగించామని సీఐ తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి..

మడికొండ : మద్యానికి బానిసై.. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన కడిపికొండలో జరిగింది. మడికొండ పోలీసులు తెలిపిన వివరాలు.. కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన జిల్ల రమేష్ (28) మద్యానికి బానిసయ్యాడు. కాగా మంగళవారం రాత్రి విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి అన్న జిల్ల శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజాబాబు తెలిపారు.

చికిత్స పొందుతున్న మరో భక్తుడి మృతి

● నాలుగుకు చేరిన మృతుల సంఖ్య



జర్పుల రాము(ఫైల్)

మంగపేట : శబరిమల అయ్యప్పస్వామిని దర్శించుకుని తిరిగి వస్తున్న క్రమంలో తమిళనాడు రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మధురై పట్టణంలోని రాజాజి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అయ్యప్ప భక్తుడు జర్పుల రాము(25) బుధవారం మృతి చెందాడు. దీంతో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య నాలుగుకు చేరింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం ఉచిత అంబులెన్స్‌లో తీసుకు వచ్చే క్రమంలో తమిళనాడులో తుపాన్ కారణంగా అంబులెన్సులు బుధవారం రాత్రి వరకు కూడా అందుబాటులో లేవని, దీంతో ఆలస్యం అవుతుందని కుటుంబీకులు తెలిపారు. కాగా మృతదేహం గురువారం సాయంత్రం వరకు ఇంటికి వచ్చే అవకాశం ఉందన్నారు. మృతుడికి భార్య సింధూజ, కుమార్తె డింపుల్, తల్లిదండ్రులు రాజు, లక్ష్మి ఉన్నారు. దైవదర్శనానికి వెళ్లిన రాము కానరాని లోకానికి వెళ్లడంతో బంధువుల కుటుంబాల్లో తీరని విషాదం అలముకుంది.

విషాదం నింపిన శబరిమల యాత్ర

శబరిమల యాత్రకు వెళ్లి ఒకే గ్రామానికి చెందిన నలుగురు అయ్యప్ప భక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కమలాపురంలో విషాదంనెలకొంది. మంగళవారం రాత్రి ముగ్గురి మృతదేహాలు కమలాపురం గ్రామానికి చేరుకోగా బాధితుల కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. సంఘటనలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాము, కూనూరు అజయ్ క్షేమంగా ఇంటికి తిరిగి వస్తారని అనుకున్న కుటుంబ సభ్యులకు రాము మృతి చెందినట్లు సమాచారం రావడంతో మృతుడి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఫుడ్ పాయిజన్‌తో బ్యాంకు ఉద్యోగి మృతి



రమేష్‌గౌడ్(ఫైల్)

చిల్పూరు : మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన బత్తిని రమేష్‌గౌడ్(56) మండి బజార్ ఇండియన్ బ్యాంకులో క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రమేష్‌గౌడ్ ఇటీవల అసెంబ్లీ ఎన్నికల విధులకు వెళ్లి అస్వస్థతకు గురికాగా ఆస్పత్రిలో చేర్పించారు. కాగా ఫుడ్ పాయిజన్‌తో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు బాధిత కుటుంబ సభ్యులు బత్తిని ఎల్లయ్య, సుభాష్ తెలిపారు. మృతుడికి భార్య రమ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సర్పంచ్ కొంగరి రవి, ఉప సర్పంచ్ వంశి, నాయకులు, తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

నీటి సంపులో పడి చిన్నారి..



లియాన్సీ (ఫైల్)

ఎల్కతుర్తి : ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఓ చిన్నారి మృతిచెందిన సంఘటన బుధవారం ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పర్లపెల్లి దీక్షిత–మంజునాథ్ దంపతుల కుమార్తె లియాన్సీ(1)ని ఎత్తుకొని ఆడిస్తున్న క్రమంలో తల్లికి ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి కింద పడిపోయింది. దీంతో చిన్నారి సైతం కిందపడగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న నీటి సంపులో పడి మృతి చెందినట్లు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కేయూలో తాత్కాలిక అధ్యాపకుల నియామకం

● వివిధ విభాగాలకు కేయూ రిజిస్ట్రార్ లేఖలు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో ఈ విద్యాసంవత్సరం (2023–24)లో టెంపరరీ ఫ్యాకల్టీ పార్ట్‌టైం పేమెంట్ బేసిక్‌లో నియామకానికి కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్‌రావు అన్ని విభాగాలకు లేఖలు పంపారు. కాకతీయ యూనివర్సిటీలో రెగ్యులర్ అధ్యాపకుల కొరత ఉందని ఇప్పటికే కాంట్రాక్టు, పార్ట్‌టైం లెక్చరర్లు కూడా పని చేస్తున్నారు. అయితే వివిధ విభాగాల్లో ఇంకా వర్క్‌లోడు ఉండడంతో పార్ట్ టైం పద్ధతిలో ఫ్యాకల్టీని నియమించాలనే డిమాండ్ ఉంది. ఈనేపథ్యంలో ఎట్టకేలకు వర్క్ లోడుకు అనుగుణంగా తాత్కాలిక అధ్యాపకుల నియమకానికి పార్ట్‌టైం చెల్లింపుల ప్రాతిపదికన నియమించుకోవచ్చని అన్ని విభాగాల అధిపతులకు రిజిస్ట్రార్ ఇటీవలనే లేఖలు పంపారు. పీజీ ఉత్తీర్ణతతో పాటు 55 శాతం మార్కులు ఉండి, నెట్, సెట్ లేదా పీహెచ్‌డీ కలిగి ఉన్నవారు అర్హులు. నియామక ఎంపిక రాత పరీక్షతో పాటు ఇంటర్వ్యూ విత్ డెమోను కూడా నిర్వహించాల్సి ఉంటుంది. ఎంపికలో మెరిట్ అండ్ రూల్ ఆఫ్‌రిజర్వేషన్‌ను పాటించాలని రిజిస్ట్రార్ పంపిన లేఖల్లో పేర్కొన్నారు.

ఎలక్ట్రికల్ షాపులో చోరీ



చోరీ జరిగిన షాపు



వివరాలు సేకరిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు

● రూ.లక్ష నగదు అపహరణ

స్టేషన్‌ఘన్‌పూర్ : డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని శ్రీసాయి ప్రసన్న ఎంటర్‌ప్రైజెస్ అండ్ ఎలక్ట్రికల్ షాపులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి కౌంటర్‌లో ఉన్న దాదాపు రూ.లక్ష నగదును అపహరించారు. బాధితుడు, షాపు యజమాని చాగంటి రాజన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజన్న రోజూ మాదిరిగినే తన షాపును మంగళవారం రాత్రి 9 గంటలకు బంద్ చేసి షట్టర్‌కు తాళం వేశాడు. బుధవారం ఉదయం షాపు తెరిచి చూసేసరికి షట్టర్ కొద్దిగా పైకి ఎత్తి ఉంది. అనుమానంతో షాపులోకి వెళ్లి చూడగా కౌంటర్‌లో ఉన్న నగదు కనిపించలేదు. దీంతో షాపులో దొంగతనం జరిగిందని తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించాడు. కాగా విషయం తె లుసుకున్న పోలీసులు, ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీం వారు స ంఘటన స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసరావు ఘటన స్థలానికి చేరుకుని బాధితుడితో మాట్లాడి వివరాలు సేకరించారు.

సీసీ ఫుటేజీలో నలుగురు నిందితులు

షాపు వద్ద ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీలో నలుగురు నిందితులు కలిసి దొంగతనం చేసిన తీరు రికార్డ్ అయింది. తెల్లవారుజామున 2గం.20 నిమిషాల ప్రాంతంలో మంకీ క్యాప్ ధరించిన నలుగురు షాపు వద్దకు చేరుకుని షట్టర్‌ను కొద్దిగా ఎత్తి ముగ్గురు షాపులోకి వెళ్లారు. మరొకరు షట్టర్ సందు నుంచి లోపలికి దూరి నేరుగా కౌంటర్‌వద్దకు చేరుకున్నాడు. నోట్లో టార్చ్‌లైట్‌తో స్క్రూ డ్రైవర్ సహాయంతో కౌంటర్‌ను ఓపెన్ చేసి అందులో ఉన్న నగదును జేబులో దాచుకొని అక్కడ నుంచి ఉడాయించాడు. మంకీక్యాప్‌తో పాటు చేతులకు గ్లౌజ్ ధరించాడు. కేవలం నాలుగు నిమిషాల వ్యవధిలోనే నిందితులు చోరీ చేసి పరారయ్యారు. చోరీ చేసిన వారు చెడ్డీ గ్యాంగ్ వారని పోలీసులు అనుమానిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్ ప్రదేశంలోనే చోరీ జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ, పెట్రోలింగ్ తగ్గిందని, గస్తీని పెంచాలని ప్రజలు కోరుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నిందితులను పట్టుకుంటామని సీఐ రాజు తెలిపారు.